క్లుప్తంగా

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

ఎన్పీకుంట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల నుంచి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు ఎస్టీయూ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు తిరుపాల్‌నాయక్, డి.వి.శ్రీనివాసులు, ఉర్దూ ఉపాధ్యాయులు సమీఉల్లా, పీడీ షఫీ, ఉపాధ్యాయినులు రాధమ్మ, సౌభాగ్యలకు ఎస్టీయూ, పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించి, వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శిరీషారెడ్డి, రామ్మోహన్, ఎస్టీయూ నాయకులు హరిప్రసాద్‌రెడ్డి, రామాంజులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

25న వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఈ నెల 25న నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు వైకే శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలో బుధవారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండె వైద్య నిపుణులు సౌమ్య, జనరల్, ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ అనూష వైద్యపరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరాన్ని ఉంటుదన్నారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ కోశాధికారి రాధాకృష్ణ, పీఆర్‌ఓ జయరాం, డాక్టర్ బీవీ సుబ్బారావు, సభ్యులు కోటేశ్వరరావు, వాసుదేవుడు, రమేష్ బాబు, శివప్రసాద్, బండి నాగేంద్ర, కావేరి ఆసుపత్రి ప్రతినిధి మునీంద్ర ఉన్నారు.

డెయిరీ ప్రారంభం

నల్లచెరువు: మండల కేంద్రంలోని అగ్రికల్చర్ ఆఫీస్ వద్ద 'జగనన్న పాలవెల్లువ' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన అమూల్ పాల డెయిరీని బుధవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ రమణారెడ్డి పాల్గొన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ.. జగనన్న ప్రభుత్వం పాడి పరిశ్రమకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వైస్ ఎంపీపీ నారాయణస్వామి, జేసీఎస్ కన్వీనర్ రాజశేఖర్, అమూల్ డెయిరీ డైరెక్టర్ సుకుంజీ, అసిస్టెంట్ మేనేజర్ లక్ష్మీకాంత్, ఉదయ్‌కిరణ, ఏపీ మేనేజర్ సీవీ రమణ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సీఐకి వీడ్కోలు



ట్రాఫిక్ సీఐను సన్మానిస్తున్న సీఐ సుబ్రమణ్యం

ధర్మవరం రూరల్: బదిలీపై వెళ్తున్న ట్రాఫిక్ సీఐ వహీద్ బాషాకు బుధవారం వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వృత్తి పట్ల అంకిత భావంతో పనిచేసి అనతి కాలంలోనే మన్ననలను పొందారన్నారు.

ఈకేవైసీపై నేడు ప్రత్యేక క్యాంప్

నల్లమాడ: రైతులకు ఈకేవైసీ చేయించే నిమిత్తం నల్లమాడ–1 ఆర్‌బీకే పరిధిలో గురువారం (నేడు) ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏఓ మహేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈకేవైసీ చేయించుకుంటేనే పీఎం కిసాన్ డబ్బు ఖాతాలో జమవుతాయన్నారు.

2,201 మంది రైతులకు లబ్ధి

కదిరి అర్బన్: ఈకేవైసీ కంట్రోల్ రూమ్‌తో డివిజన్ వ్యాప్తంగా 2,201 రైతులకు పీఎం కిసాన్ పథకంలో లబ్ధి చేకూర్చామని ఏడీఏ సత్యనారాయణ బుధవారం తెలిపారు. ఈకేవైసీ ప్రక్రియ ఓటీపీ, ఫేషియల్ యాప్‌లో చేసినట్లు పేర్కొన్నారు. కదిరి ఏడీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి 18,843 ఫోన్ కాల్స్ ప్రయత్నిస్తే 8,095 మంది రైతులు స్పందించారన్నారు. ఈ నెల 28 వరకు ఈకేవైసీ చేస్తామని పేర్కొన్నారు.

జనరల్ ఇన్సూరెన్స్‌తో భరోసా

తాడిమర్రి: ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ పాలసీతో మృతుని (పాలసీదారుని) కుటుంబానికి ఆర్థిక భరోసా లభిస్తుందని మేనేజర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక ఎస్‌బీఐలో బుధవారం ఆయన మాట్లాడారు. ఏడాదికి రూ.1,000 బీమా చేయించుకుంటే, రూ.20 లక్షల బీమా అందుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఎస్‌బీఐలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం చేస్తున్న కేతిరెడ్డి సుప్రియ

ముదిగుబ్బ: మండల కేంద్రానికి చెందిన అశోక్ అనే వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. బుధవారం స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సతీమణి కేతిరెడ్డి సుప్రియ తన నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు రూ.50 వేల ఆర్థిక సాయం చేశారు.

జీవితంలో యోగా భాగం కావాలి



యోగాసనాలు వేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, యోగా గురువు గొర్ల నారాయణరెడ్డి



బుక్కపట్నం బాలుర ఉన్నత పాఠశాలలో యోగాసనాలు



ఉపాధి హామీ పనుల వద్ద యోగాసనాలు వేస్తున్న అధికారులు

ధర్మవరం అర్బన్: ప్రతి మనిషికి జీవితంలో యోగా ఒక భాగం కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి తెలిపారు. ధర్మవరం పట్టణంలోని మార్కెట్‌యార్డులో బుధవారం 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శ్రీ ఆది గురు యోగా కేంద్రం గురువు గొర్ల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సామూహిక యోగాసనాలు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మున్సిపల్‌చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైఎస్సార్ సీపీ చేనేత నాయకులు కాచర్ల అంజి మాట్లాడుతూ రోజూ యోగాసనాలు చేయడం వల్ల శరీరానికి, మనసుకు ఎంతో ప్రశాంతత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిగురు యోగా కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.

- పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ధర్మవరం యోగా అసోసియేషన్ అధ్యక్షుడు సోమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ముఖ్య అతిథిగా సాంస్కృతిక మండలి వ్యవస్థాపకుడు సత్రసాల ప్రసన్నకుమార్, హిందీ పండిట్ వేణుగోపాల్, హెచ్‌ఎం రాజేశ్వరి, బ్రహ్మకుమారీస్ రాధ హాజరై యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ధర్మవరం యోగా అసోసియేషన్ అధ్యక్షుడు సోమేశ్వర్‌రెడ్డి, ఆదినారాయణ, లక్ష్మయ్య, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.
- కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ జీవన్‌కుమార్‌ల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు యోగాసనాలు వేశారు.

యశోద కాన్సెప్ట్ స్కూల్‌లో..

ధర్మవరం రూరల్: పట్టణంలోని యశోద కాన్సెప్ట్ స్కూలులో యశోద బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భగా యోగా ప్రాముఖ్యతను, ఆవశ్యకతను, విద్యార్థులకు వివరిస్తూ వారిచే యోగాసనాలను వేయించారు. కార్యక్రమంలో డైరెక్టర్ పృథ్వీరాజ్, ప్రిన్సిపాల్ అనుప్, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పుట్టపర్తి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందుతారని విశ్రాంత డైట్ ప్రిన్సిపాల్ మునెయ్య అన్నారు. ఆయన బుధవారం డైట్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మయ్య తదితరులతో కలిసి యోగాడేలో విడివిడిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో మానసిక ఉల్లాసం, ఆనందం కలుగుతుందన్నారు.

యోగాతో ఏకాగ్రత పెంపు

బత్తలపల్లి: యోగాతో ఏకాగ్రత పెరుగుతుందని ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ కోటి సుధ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ శ్రీదేవి, ఎంఈఓ సుధాకర్‌నాయక్ పేర్కొన్నారు. జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని బుధవారం బత్తలపల్లిలోని మహాత్మాజ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులు యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ యోగా చేయడాన్ని అలవర్చుకోవాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణంలో వారు మొక్కలు నాటి, నీళ్లు పోశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కదిరిలో..

కదిరి అర్బన్: పట్టణంలోని షిర్డీసాయి హైస్కూల్‌లో బుధవారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఎంఈఓ బీవీ శివారెడ్డి హాజరయ్యారు. యోగాతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కలుగుతుందన్నారు. పాఠశాలలో ప్రతి గురు, శుక్రవారాల్లో యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ సురేష్ తెలిపారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

తనకల్లు మండలంలో..

తనకల్లు: మండల పరిధిలోని చీకటిమానిపల్లి గ్రామ సచివాలయంలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పూల నరసింహులు మాట్లాడుతూ మారిన జీవన పరిస్థితుల కారణంగా ప్రతి ఒక్కరూ యోగాసనాలను నేర్చుకోవాలన్నారు. యోగా వల్ల శారీరక, మానసికంగా ప్రశాంతంగా ఉండవచ్చని తెలిపారు. అనంతరం సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులతో యోగాసనాలు వేయించారు.

కట్టకిందపల్లి వద్ద..

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని కట్టకిందపల్లి వద్ద బుధవారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీడీ వెంకటా చలపతి హాజరయ్యారు. ఉపాధి సిబ్బంది, కూలీలు, మామిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో మామిళ్లపల్లి పాఠశాల పీడీ వెంకట శివారెడ్డి, ఏపీఓ అనీల్‌కుమార్‌రెడ్డి, జేఈ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పని వద్ద

నల్లమాడ: బొగ్గలపల్లి వద్ద జమాల్‌ఖాన్ పెద్ద చెరువులో 'ఉపాధి' హామీ పనుల వద్ద బుధవారం అధికారులు యోగా దినోత్సవం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయ ఏఓ రామచంద్రారెడ్డి, ఏపీఓ సుబహాన్, ఈసీ షేక్షావలీ, వైఎస్సార్ సీపీ నాయకులు నాగరాజునాయుడు, అంజినాయక్, ఉపాధి కూలీలతో కలిసి యోగాలో పాల్గొన్నారు. టెక్నికల్ అసిస్టెంట్ నాగేంద్ర వారిచేత యోగాసనాలు వేయించారు.

ముదిగుబ్బలో..

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, వ్యాయామ ఉపాధ్యాయురాలు రేఖ, విద్యార్థులు యోగాసనాలు వేశారు.

- ఉప్పలపాడులో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా ఎంపీడీఓ విజయలక్ష్మి హాజరయ్యారు. గ్రామస్తులతో కలిసి యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీనారాయణమ్మ, ఎంపీటీసీ లతా లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యోగా దినోత్సవం

కనగానపల్లి: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం లక్ష్మీదేవి ఆధ్వర్యంలో యోగా మాస్టరు సుబ్బరాయుడు వందలాది మంది విద్యార్థులచేత యోగాసనాలు వేయించారు. యోగా వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం అద్భుతమైన యోగాసనాలు ప్రదర్శించిన విద్యార్థులకు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీదేవి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రవికిరణ్, పీడీలు రమేష్, మాధవరాజులు, సర్పంచ్ అంకె పరిమళ పాల్గొన్నారు.



కనగానపల్లిలో పాఠశాల ఆవరణంలో విద్యార్థుల యోగాసాధన

విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు

బత్తలపల్లి: ప్రభుత్వ పాఠశాలలతో.. కార్పొరేట్ స్కూళ్లే పోటీ పడేలా విప్లవాత్మక సంస్కరణలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని పలువురు వక్తలు అన్నారు. బుధవారం స్థానిక మహాత్మాజ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ సుధాకర్‌నాయక్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ కోటి సుధ, ఎంపీడీఓ శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యతో విలువ, విశ్లేషణ శక్తి వస్తుందని, సంస్కార కోణం అబ్బుతుందన్నారు. అంతటి మహత్తర శక్తి కలిగిన విద్యామృతాన్ని పిల్లలకు అందించాలనే ఉన్నత లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థకు నవ్యత్వాన్ని అద్దుతున్నారన్నారు. అనంతరం పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన సుదర్శన్, హేమంత్, నిహాంత్ 'ఆణిముత్యాలు'గా ఎంపికకాగా వారి తల్లిదండ్రులకు నగదు పంపిణీ చేశారు.



విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు

పాఠశాలలో 500 మార్కులు పైన వచ్చిన భరత్, రమేష్, మోహిత్‌కు సైతం ప్రిన్సిపాల్ సత్యనారాయణ ఎన్ని మార్కులు వచ్చి ఉంటే అంత నగదు అందజేశారు. అంతకు ముందు తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కొడవండ్లపల్లి చంద్రశేఖర్ దాతల సహకారంతో నిర్మించిన డార్మెట్‌ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, చైర్మన్ కొడవండ్లపల్లి చంద్రశేఖర్, ఉపాధ్యాయులు మాధవి, మురళీమోహన్, రమేష్, రవిచంద్ర, అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

బత్తలపల్లి: విద్యార్థులకు బ్యాకింగ్, ఆర్థిక కార్యకలాపాలపై అవగాహన కల్పించేందుకు బుధవారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్విజ్ పోటీలను నిర్వహించారు. మొదటి స్థానంలో ఎస్.మదిహ, ఎస్.జి.ఆఫ్రిన్ సుహాన నిలిచి రూ.5 వేల నగదు గెలుచుకున్నారు. ద్వితీయ బహుమతి కేజీబీవీ సంజీవపురం విద్యార్థులు కె.స్పందన, సుమాంజలి రూ.4 వేల నగదును గెలుచుకున్నారు. తృతీయ బహుమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రామాపురం విద్యార్థులు కె.మౌనిక, ధనూష రూ.3 వేలు అందుకున్నారు. విద్యార్థులను హెచ్‌ఎం జయంతి ప్రశంసించి, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బత్తలపల్లి యూనియన్ బ్యాంకు డిప్యూటీ మేనేజర్ చంద్రశేఖర్, ఎంఈఓ చాముండేశ్వరి, హెచ్‌ఎం జయంతి, ఉపాధ్యాయులు పద్మావతి, ఆనందరెడ్డి, శరణ్య, రాజేంద్రప్రసాద్, లక్ష్మీనారాయణ, గీతాంజలి, పార్వతి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

తలుపులలో...

తలుపుల: స్థానిక కేజీబీవీలోమండల స్థాయి పోటీ పరీక్షలు యూనియన్ బ్యాంకు మేనేజర్ మనిచందన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రథమ బహుమతి రూ.5 వేలు తలుపుల ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు సుశాంత్‌రెడ్డి, శ్రీనాథ్‌కు, ద్వితీయ బహుమతి రూ.4 వేలు కేజీబీవీ విద్యార్థులు లతా, మహాలక్ష్మికి, తృతీయ బహుమతి రూ.3 వేలు కుర్లి హైస్కూల్ విద్యార్థులు అఖిల, ఉషారాణికి అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఓ మోహనమ్మ, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈ. పుల్లారెడ్డి, చంద్రబాబు, మహమ్మద్ షఫీ పాల్గొన్నారు.



బత్తలపల్లి: ప్రశంసాపత్రాలు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఓడీ చెరువులో..

ఓడీ చెరువు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బుధవారం 'ఏపీజీబీ' ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంఈఓ ఖాదర్‌వలిబాష ప్రశంస పత్రం, బహుమతులలను ప్రదానం చేశారు. ప్రథమ స్థానంలో ఓడీసీ ఉన్నత పాఠశాలకు చెందిన అశ్వని, ద్వితీయ స్థానంలో గొనిపల్లి పాఠశాలకు చెందిన గణేష్, తృతీయ స్థానంలో కొండకమర్ల పాఠశాలకు చెందిన కార్తీక్ నిలిచినట్లు ఎంఈఓ తెలిపారు.

అర్హులందరికీ ఇళ్లు

కనగానపల్లి: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందని జెడ్పీటీడీ సభ్యుడు మారుతిప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన హౌసింగ్ అధికారులు, మండల వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి మండలంలోని బద్దలాపురం గ్రామంలోని జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇళ్లన్నీ త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని హౌసింగ్ ఏఈ చిరంజీవికి సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, యూత్ కన్వీనర్ అంకె అశోక్, నాయకులు రమణారెడ్డి పాల్గొన్నారు.



బద్దలాపురంలో ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు

ఉచిత బోర్లతో రైతులకు మేలు

రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సహకారంతో వేయిస్తున్న ఉచిత బోర్ల కార్యక్రమం ద్వారా రైతులకు మేలు జరుగుతోందని సొసైటీ అధ్యక్షుడు వలగొండ భాస్కర్ తెలిపారు. బుధవారం ఆయన జెడ్పీటీసీ మారుతిప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల నాయకులతో కలిసి రైతు కురుబ రమేష్ పొలంలో వేసిన బోరును పరిశీలించారు. నీరు పుష్కలంగా పడటంతో హర్షం వ్యక్తం చేశారు.

ఉత్తీర్ణత పెరగకపోతే చర్యలు

రామగిరి: 'మహాత్మా జ్యోతిభా పూలే గురుకుల పాఠశాలలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సౌకర్యాలన్నీ కల్పిస్తోంది. కానీ ఇక్కడి ఉపాధ్యాయులు సెల్‌ఫోన్లు చూసుకుంటూ కాలం గడిపేస్తున్నారు. అందువల్లే పదో తరగతి ఉత్తీర్ణత శాతం తగ్గుతోంది. వచ్చే ఏడాది ఉత్తీర్ణత శాతం తగ్గితే ఉపాధ్యాయులపై చర్యలు తప్పవు' అని గురుకుల పాఠశాలల అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ (ఏజీఓ) రాజేంద్రనాథ్‌కుమార్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన పేరూరు డ్యాంలోని ఏపీ ఆర్‌ఎస్ బాలుర పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గతంలో రాష్ట్రంలో ఈ పాఠశాల ఉత్తీర్ణత చాలా బాగుండేదని, ఉపాధ్యాయుల లోపంతో మూడేళ్లుగా ఉత్తీర్ణత శాతం బాగా పడిపోయిందన్నారు. ఈ విద్యా సంవత్సరం పదో తరగతి ఉత్తీర్ణత వందశాతం రాకపోతే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పాఠశాల రికార్డులు, విద్యార్థుల భోజన వసతిని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఓబులేసుతోపాటు ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంయూఏ నాయకుల నిరసన

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో బుధవారం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్‌ఎంయూఏ) నాయకులు ఎర్రబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఎన్‌ఎంయుఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణ, జోనల్ వైస్ ప్రెసిడెంట్ జేపీ కుమార్, రీజనల్ అధ్యక్షులు అశ్వర్థామయ్య, రీజనల్ నాయకులు నాగశేఖర్, నీళ్ల శంకరయ్య, దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అక్రమ బదిలీలు నిలుపుదల చేయాలన్నారు. అక్రమ పనిష్మెంట్లు, అక్రమ సస్పెన్షన్‌లు నిలిపేయాలన్నారు. గ్యారేజీలో అన్ని క్యాటగిరీల్లో సిబ్బందిని నియమించాలని, పనిముట్లు తెప్పించాలని, నైట్‌అవుట్, నైట్ షిఫ్ట్ అలవెన్స్‌లలో ప్రతినెలా జీతంతో కలిసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. యూనియన్ నాయకులు హనుమాన్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

సమస్యలు పరిష్కరించాలి

కదిరి అర్బన్: సమస్యలు పరిష్కరించాలంటూ స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీ ఎదుట నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు ఎర్రబ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. యూనియన్ కడప జోన్ జాయింట్ సెక్రటరీ శ్రీరాం నాయక్ హాజరై మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ప్రజా రవాణా అధికారి మొండి వైఖరి విడనాడాలన్నారు. రీజినల్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, గంగన్న, రామక్రిష్ణ, నారాయణ స్వామి, బైరిశెట్టితో పాటు పలువురు పాల్గొన్నారు.

పుట్టపర్తిలో..

పుట్టపర్తి టౌన్: కార్మికుల సమస్యలపై దృష్టి సారించాలని ఆర్టీసీ ఎన్‌ఎంయూ యూనియన్ నాయకులు కోరారు. రీజినల్ కమిటీ పిలుపు మేరకు బుధవారం డీపీటీఓ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా డిపో ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో రీజనల్ ఉపాధ్యక్షులు రవితేజ, ట్రెజరర్ చంద్రాయుడు, యూనియన్ నాయకులు అప్పిరెడ్డి, బాబ్జాన్, కళావతి, ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

అమడగూరు: సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జేసీఎస్ కన్వీనర్ జయప్ప పేర్కొన్నారు. తుమ్మల, పూలకుంటపల్లి, చీకిరేవులపల్లి సచివాలయాల్లో బుధవారం గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో సమావేశాలు నిర్వహించారు. సర్పంచులు సురేంద్రరెడ్డి, లక్ష్మీనరసమ్మ, అర్పిత, తదితరులున్నారు.

కదిరిలో భారీ వర్షం

కదిరి టౌన్: పట్టణంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. రోడ్లు జలమయమయ్యాయి.వలీసాబ్ రోడ్డు,కంచుకోట, రాధాక్రిష్ణ వీధి, దేవళం బజారు, సింహకోట, ఆడపాలవీధి, అమీన్‌నగర్, బాబాకాలనీ, జొన్నకాలనీల్లో నీరు భారీగా ప్రవహించింది. ఇళ్లలోకి చేరడంతో కాలనీవాసులు ఇబ్బంది పడ్డారు.

మోడల్ క్లస్టర్ లెవల్ ఫెడరేషన్‌పై డెమో

బత్తలపల్లి: స్థానిక భారతి మండల సమాఖ్య కార్యాలయంలో మోడల్ క్లస్టర్ లెవల్ ఫెడరేషన్ కార్యక్రమంపై ఏపీఎంలు, వీఓలకు డెమో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. బుధవారం ప్రాజెక్టు డైరెక్టర్ నరసయ్య, డీపీఎం ఫైనాన్స్ రామిరెడ్డి, డీపీఎం ఎల్‌హెచ్ రామ్మోహన్, డీపీఎం నాగరాజు, ఏరియా కోఆర్డినేటర్ రామేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. టీఓటీ ట్రైనర్లు చిలమత్తూరు ఏపీఎం భారతి, గుడిబండ ఏపీఎం ముత్యాలప్ప శిక్షణ ఇచ్చారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



మాట్లాడుతున్న ఆర్‌ఎం రవీంద్రారెడ్డి

కదిరి అర్బన్: మండల పరిధిలోని కాళసముద్రం గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై బుధవారం వెలుగు ఏపీఎం సూర్యనారాయణ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ రవీంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమా, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకాలపై అవగాహన కల్పించారు. బ్యాంకు ఖాతా ఉన్న వారు ఏడాదికి రూ. 436 చెల్లిస్తే ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి కింద రూ.రెండు లక్షల బీమా సౌకర్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యతా కౌన్సిలర్ వీరమారుతీ, నాగప్ప, ఏపీజీబీ మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు ఉన్నారు.

పరీక్ష ప్రశాంతం

బత్తలపల్లి: మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలోని బ్యాక్‌లాగ్ పోస్టులకు బుధవారం నిర్వహించిన ఎంపిక పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. నాలుగు బ్యాక్‌లాగ్ పోస్టులు ఉండగా 23 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. పరీక్షకు 17 మంది హాజరయ్యారన్నారు. ఏపీసీ డబ్ల్యూఓ జోన్ 4 అధికారి రాజేంద్రనాథ్‌రెడ్డి పర్యవేక్షించారన్నారు. నలుగురిని ఎంపిక చేశామని, కలెక్టర్ అనుమతి కోసం పంపించామన్నారు.

ఆట పాటలతో విద్య

ధర్మవరం రూరల్: ఆట పాటలతో అంగన్‌వాడీ విద్యను అందిస్తామని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మి అన్నారు. బుధవారం పట్టణంలోని దుర్గానగర్ సీతారామాంజనేయస్వామి కళ్యాణ మండపంలో గ్రాడ్యుయేషన్ డే, జన భాగీదారి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వార్డు కౌన్సిలర్ యల్లయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలను పంపించడం ద్వారా పిల్లలకు విద్య పట్ల ఆసక్తి ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అరుణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు మమత, అరుణ, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించుకోవాలి

బత్తలపల్లి: రైతులు తాము నాటుకున్న మొక్కలను సంరక్షించుకోవాలని ఎంపీడీఓ శ్రీదేవి సూచించారు. బుధవారం మండలంలోని ఈదుల ముష్టూరు పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద రైతులు నాటుకున్న మొక్కలను ఆమె ఏపీఓ కుందానం ఆదెప్పతో కలిసి పరిశీలించారు. రైతులు ఏ విధంగా మొక్కలకు నీరు అందిస్తున్నది, మొక్క ఎదుగుదలకు తీసుకున్న జాగ్రత్తలను అడిగి తెలుసుకున్నారు. రైతులు నాటిన మొక్కలన్నింటిని సంరక్షించుకుంటే ప్రభుత్వం నుంచి ఉపాధిహామీ పథకం ద్వారా అందిస్తున్న నగదు జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఓబిలేసు, రైతులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలం పరిశీలన



పేరూరు కొత్తపల్లి గ్రామంలో రైతులతో చర్చిస్తున్న అధికారులు

రామగిరి: మండల పరిధిలోని పేరూరు కొత్తపల్లి గ్రామంలో వివాదాస్పద స్థలాన్ని బుధవారం తహసీల్దార్ నారాయణస్వామి, ఎస్ఐ జనార్దన్‌నాయుడు పరిశీలించారు. సర్వే నంబర్ 150లో పొలాలకు వెళ్లే దారి ఉండగా, పొలం యజమాని ఇటీవల దారికి అడ్డంగా రాళ్లు వేశాడని రైతులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే కొత్తపల్లి గ్రామానికి వచ్చిన అధికారులు స్థలాన్ని పరిశీలించారు. త్వరలోనే సమస్యకు పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపడతామని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బందితోపాటు పలువురు రైతులు పాల్గొన్నారు.